కేంద్రీయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని పెద్దపాడు వద్ద గల కేంద్రీయ విద్యాలయంలో రెండు నుంచి ఆపై తరగతుల్లో ఖాళీగా ఉన్న మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.వి రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు ఈనెల రెండు నుంచి 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ దరఖాస్తులు కేంద్రీయ విద్యాలయంలో గానీ, విద్యాలయం వెబ్‌సైట్ నుంచి గానీ పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు విద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

రేషన్ తీరు మారలే...

- ఏ సరుకు ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి
- ఈనెలా బియ్యం, పంచదారే
- మూడు నెలలుగా పంపిణీ కాని కందిపప్పు

ప్రభుత్వం మారినా ప్రజా పంపిణీ వ్యవస్థ తీరు మారలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో బియ్యం, పంచదార, కొద్ది నెలలు గోధుమపిండి, రాగిపిండి లబ్ధిదారులకు అందించేది. అప్పడప్పుడూ కందిపప్పు పంపిణీ చేసే పరిస్థితి ఉండేది. మొత్తం మీద ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి ఉండేది. రేషన్ సరుకులకు వైసిపి ప్రభుత్వం కోత పెట్టిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సందర్భాల్లో విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే అన్ని రకాల రేషన్ సరుకులను అందించడంతో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానులను అందిస్తామంటూ హామీనిచ్చారు. కానుకల విషయం పక్కనపెడితే కనీసం రేషన్ సరుకులనూ సక్రమంగా పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,60,885 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 19,39,082 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 422 మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా సరుకులను అందిస్తున్నారు. ఈనెలలో బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, పంచదార తదితర సరుకులు అందిస్తారని అంతా భావించినా అందరికీ సరుకులు అందిన పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలలు గోధుమపిండి పంపిణీ చేసినా, జనవరిలో దాన్నీ ఆపేసింది. జనవరిలో బియ్యం, పంచదార, కందిపప్పు ఇచ్చారు. ఫిబ్రవరి, మార్చిలో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం ఏప్రిల్ రేషన్‌లోనూ బియ్యం, పంచదారే అందిస్తున్నారు.

మూడు నెలలుగా ఆగిన కందిపప్పు పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వ హయాంలో 2023 జూన్ నుంచి డిసెంబర్ వరకు కందిపప్పు సరఫరా చేయలేదు. గతేడాది పండగకు మాత్రం జనవరిలో పంపిణీ చేశారు. తర్వాత అక్కడ నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. మార్చి నుంచి జూన్ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో కందిపప్పు కొనుగోళ్లు, పంపిణీ అంశాలను ప్రభుత్వం పక్కన పెట్టింది. జూన్‌లో కొత్తగా కొలువుదీరిన టిడిపి కూటమి ప్రభుత్వం పౌర సరఫరాల సంస్థపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా రేషన్‌లో అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినా, అది కార్యాచరణకు నోచుకోలేదు. ఈ ఏడాది జనవరిలో కందిపప్పు ఇచ్చారు. ఆ తర్వాత మూడు నెలలుగా దాన్నీ ఆపేశారు. రాష్ట్రస్థాయిలో టెండర్లు పూర్తి కాకపోవడంతో, కందిపప్పు పంపిణీ నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

రంజాన్ తోఫా ఎగవేత

2014-19 వరకు టిడిపి ప్రభుత్వం ఏటా క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు కానుకను అందించేది. పేదలకు బియ్యంతో పాటు కందిపప్పు, అరకేజీ బెల్లం, కేజీ పంచదార, కేజీ గోధుమపిండి, లీటరు ఆయిల్ ప్యాకెట్, నెయ్యి వంటి సరుకులను పంపిణీ చేసేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని ఆపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

మళ్లీ ఆ సరుకులు అందుతాయని అంతా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సందర్భాల్లో రేషన్ దుకాణాల ద్వారా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫా కానుక అందిస్తామంటూ పకటించారు. సంక్రాంతి, క్రిస్మస్ కానుకల మాదిరిగానే రంజాన్ తోఫానూ ప్రభుత్వం ఎగ్గొట్టింది.

అధిక ధరకు కందిపప్పు కొనుగోలు

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పును అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.135 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67కే అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్‌లో కందిపప్పు ధర అంతకంతకూ పెరుగుతోంది.

'ఉపాధి'లో ఉత్తమ ఫలితాలు

- మహిళలకు పని కల్పనలో రాష్ట్రంలో మొదటి స్థానం
- పనిదినాల కల్పన, కూలీలకు చెల్లింపుల్లోనూ ప్రథమం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ) అమల్లో భాగంగా మూడు కాంపోనెంట్ అంశాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళా కూలీలకు 147.13 లక్షల పనిదినాలు కల్పించి, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. ఉపాధి కూలీలకు మొత్తం 180 లక్షల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 205.73 లక్షల పని దినాలు (114.29 శాతం) కల్పించి మొదటి స్థానం దక్కించుకున్నామని వెల్లడించారు. కూలీలకు రూ.510.95 కోట్ల మేర చెల్లించి రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందామని పేర్కొన్నారు. మెటీరియల్ పనుల కోసం రూ.323.41 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, రూ.292.19 కోట్లను (90.35 శాతం) ఖర్చు చేసి ప్రథమ స్థానం సాధించామని తెలిపారు. అదేవిధంగా వంద రోజులు పని కల్పించిన కుటుంబాల సంఖ్య, వేతనం, మెటీరియల్ రూపంలో ఖర్చు, వికలాంగులకు కల్పించిన పనిదినాల సంఖ్య అంశాల్లో ద్వితీయ స్థానం వచ్చిందని పేర్కొన్నారు. ఎస్‌టి కూలీలకు పనిదినాల సంఖ్య, జాబ్ కార్డు కలిగిన కుటుంబాలకు కల్పించిన సరాసరి పనిదినాల విభాగంలో తృతీయ స్థానం వచ్చిందని వెల్లడించారు. ఉపాధి హామీ సిబ్బంది సమన్వయం, కృషి ఫలితంగా రాష్ట్రంలో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించగలిగామని పేర్కొన్నారు. కూలీలకు పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చగలుగుతున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. పల్లె పండగలో భాగంగా జిల్లాలో తారు, సిమెంట్, మెటల్ రోడ్ల నిర్మాణం, సిమెంట్ కాలువల నిర్మాణం, పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం తదితర పనులు చేపట్టామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 'పంచ ప్రాధాన్యాలు' అనే భావనతో పశువులకు నీటి తొట్టెలు, సేద్యపు నీటికుంటలు, పంట కాలువల పునరుద్ధరణ, చెరువులు, కుంటల సమగ్రాభివృద్ధి, దినసరి కూలి రూ.307 వచ్చే విధంగా కార్యాచరణ అమలు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1499.03 కోట్ల అంచనా విలువతో 41,523 పనులను గుర్తించామని తెలిపారు. పనుల్లో భాగంగా గోశాల నిర్మాణాలు, సేద్యపు నీటి కుంటలు, కాంటూరు కందకాలు, కాలువలు. చెరువులు, పశువులకు నీటి తొట్టెలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు, సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్, చేపల చెరువులు, వరద కట్టలు, మట్టి రోడ్లు, భూ అభివృద్ధి పనులు, కోనేరుల్లో పూడికతీత తదితర పనులు చేపట్టనున్నామని తెలిపారు.

20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉపాధి అవకాశాలు సాధ్యమని గుర్తించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి ఆధారిత నైపుణ్య కార్యక్రమాలను అభివృద్ధి చేసి తద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఫార్మా రంగానికి సంబంధించి ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. విద్యతోపాటు ఫార్మా రంగంలో ఉద్యోగావకాశాలు పొందేందుకు దోహదపడుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఒక చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. తద్వారా పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తారని, జిల్లాలోని యువతకి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలకు సరైన నైపుణ్యం గల అభ్యర్థులను అందించేందుకు నైపుణ్య శిక్షణా కేంద్రాల ద్వారా మెరుగైన వసతులతో కూడిన శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్క ప్రభుత్వ ఉద్యోగాలతో అందరికీ ఉపాధి లభించడం కష్టతరం కావడంతో ప్రైవేటు, స్వయం ఉపాధి రంగాల్లోనూ అభ్యర్థులను తీర్చిదిద్దే విధంగా నైపుణ్య శిక్షణ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వేతనం, ప్రదేశంతో సంబంధం లేకుండా ముందుగా ఉద్యోగంలో చేరేందుకు చొరవ చూపాలన్నారు. వచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. జాబ్‌మేళాలో 32 సంస్థలు పాల్గొనగా, 1062 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 362 మంది పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఆర్‌డిఒ కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోషి, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం హెచ్చరించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పొరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఆశించి భంగపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ పరిశుభ్రతకు దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ అత్యంత కష్టంగా విధులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, ప్లాంటేషన్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఆప్కాస్ వల్ల దళారుల దోపిడీ, వేధింపులు లేవని, జీతాలతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ వాటా నిధుల్లో కోతలు లేవన్నారు. ప్రైవేటు ఏజెన్సీలైతే సకాలంలో వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉండదని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించక కార్మికులకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే అంతకంటే మెరుగ్గా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జిఒ నంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో ప్రభుత్వ ఒప్పందాలను వెంటనే అమలు చేయాలన్నారు. పెరిగిన నగర విస్తీర్ణానికి అనుగుణంగా మున్సిపల్ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలన్నారు. శానిటేషన్ పనులకు పుష్ కాట్స్, బిన్‌లు, ఇతర పనిముట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రాజు, ఎ.రాము, ఎ.గురుస్వామి, ఎ.శేఖర్, జె.మాధవి, డి.యుగంధర్, ఇంజినీరింగ్ విభాగం నాయకులు పి.మణి, త్రినాథరావు, క్లాప్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని పాలపోలమ్మ గుడి దగ్గర నుంచి ఒన్‌వే కూడలి వద్ద గల గాంధీ విగ్రహం వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన తెలిపారు. అనంతరం పట్టణంలోని టిడిపి ఎమ్మెల్యే కూన రవికుమార్ అందుబాటులో లేకపోవడంతో ఆయన వ్యక్తిగత సహాయకులకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడి సంతోష్, ఎస్.రాజేష్, కె.తారకేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గలోని గురుమూర్తి షాపింగ్ కాంప్లెక్స్ నుంచి మూడు రోడ్ల కూడలి మీదుగా పాతబస్టాండ్ వద్ద గల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎస్.వెంకటి, బి.కూర్మారావు, సిహెచ్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో సిఐటియు మండల కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆర్‌జెడితో చర్చలు విఫలం

'పది' స్పాట్ బహిష్కరణకు ఉపాధ్యాయ సంఘాల నిర్ణయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షల్లో ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఉపాధ్యాయుల సస్పెన్షన్, క్రిమినల్ కేసులు, విద్యార్థుల డిబార్‌ను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆందోళన నేపథ్యంలో ఆర్‌జెడి విజయ్ భాస్కర్‌తో మంగళవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. చర్చల సమయంలో డిఇఒ తిరుమల చైతన్యను పిలిస్తే చర్చలకు రాలేమని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు చెప్పడంతో అందుకు సమ్మతించిన ఆర్‌జెడి చర్చలకు పిలిచారు. చర్చల్లో డిఇఒను తక్షణమే విధుల నుంచి తప్పించాలని, మిగిలిన నలుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, ఉపాధ్యాయులపై ఉన్న క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని ప్రధాన డిమాండ్లుగా ఆయన ముందుంచారు. ఇందుకు ఆర్‌జెడి సమ్మతించలేదు. దీంతో ఈనెల మూడో తేదీ నుంచి చేపట్టే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌ను బహిష్కరిస్తున్నట్లు వేదిక నాయకులు ఆయనకు చెప్పి చర్చల నుంచి అర్థాంతరంగా బయటకు వచ్చేశారు. అనంతరం డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అంతకుముందు క్రిమినల్ కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఎఎస్‌పి కె.వి రమణను జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, మజ్జి మదన్‌మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, డిటిఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, ఎస్‌టియు నాయకులు జి.రమణ, ఎపిటిఎఫ్ నాయకులు భానుమూర్తి, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

ఒడియా మైనార్టీల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడియా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ఒరియా పాఠశాలలో బాపూజీ ఒడియా పాఠాఘర్ ఆధ్వర్యాన మంగళవారం ఉత్కళ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒరియా మైనారిటీల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా విప్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బాపూజీ ఒడియా పఠాఘర్ అధ్యక్షులు రఘునాథ్‌గౌడ్, ఎపి ఒడియా టీచర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బృందావన్ డొలాయి, ఉత్తరాంధ్ర ఒరియా మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణపాడి, ఎంఇఒలు అప్పారావు, విశ్వనాథ్, వార్డుకౌన్సిలర్ పరపతి మంజులత, శివప్రసాద్‌పండా, రాజేంద్రపండా పాల్గొన్నారు.

విప్ అశోక్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

వారి వివరాలు చెప్తే రూ.25 వేల నగదు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జలుమూరు మండలంలో గత నెల 29న పలు ఆలయాల గోడలపై రాతలు రాసిన వారి వివరాలు తెలియజేసిన వారికి రూ.25 వేల నగదు బహుమతిని అందించనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాతలు రాసిన వ్యక్తుల వివరాలను కింది ఫోన్ నంబర్లకు తెలపాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఎస్‌పి : 6309990800, అదనపు ఎస్‌పి (క్రైమ్) : 6309990803, శ్రీకాకుళం డిఎస్‌పి : 6309990804, నరసన్నపేట సిఐ : 6309990815, జలుమూరు ఎస్ఐ : 6309990848, ఎస్‌బి సిఐ : 6309990886

పాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి కృష్ణారావు విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ఎన్నికల్లో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో పార్టీ జిల్లా పరిశీలకులు గాదం వెంకట త్రినాథరావుతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని నిర్మాణం ఒక్కటే అభివృద్ధి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని చెప్పారు. తల్లికి వందనం పేరుతో విద్యార్థులకు ఇస్తామన్న రూ.15 వేల హామీని మర్చిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 32 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం మహిళల భద్రతపై మాట్లాడడం లేదని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కూటమి ప్రభుత్వ పాలనా విధానాలపై ఉద్యమ కార్యాచరణ చేపడతామన్నారు. జిల్లాలో ఇప్పటికే పార్టీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల నియామకం చేపట్టామని, అనుబంధ విభాగాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షునిగా అంబటి దాలినాయుడు, మైనార్టీ విభాగానికి చాన్ బాషాలను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.ఎల్.ఎస్ ఈశ్వరి, కొత్తపల్లి రాంప్రసాద్, చంద్రశేఖర్, ఉస్మాన్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు కృష్ణారావు

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM O.S. 755/2024

Between:
M/s. Lakshmi Finance Private Limited Rep. by its Special Power of Attorney Holder Kondra Anand ...Plaintiff
And:
Lopinti Kanaka Maha Lakshmi & 2 others ...Defendants

SUMMONS

To,
D-3: Sri Lopinti Bhaskar Rao,
S/o. L. Raja Rao, aged 43 years, R/at H.No.1-71, YSR Colony, Santhabommalli, Kaspa Nawpada, Srikakulam District-532211.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **17-04-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **17-04-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
TULALA VENKATESWARA RAO, KURUMUJI KOTESWARA RAO,
Advocates, Visakhapatnam-530002.
Cell: 9985747149.

CHANGE OF NAME

Under signed **KAJANA SANTIPRASAD BABU** (Old name). Main Road, P.O: Sompeta, Srikakulam District, Pin Code No.532 284. Andhra Pradesh changing my name from **KAJANA SANTIPRASAD BABU** (old name) to **KHAJANA SHANTIPRASAD BABU** (New name), s/o late VENKATA RAO for all purposes.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE ICHAPURAM. O.S. 19/2022.

Between:
Sirla Kamesh .....Plaintiff
And:
Smt. M.R. Bhagavati and 9 others .....Defendants

NOTICE TO THE DEFENDANT No.8 UNDER ORDER 5 RULE 20 C.P.C.

To,
Defendant No. 8.
Komatipalli Srinivasa Santosh,
S/o Late K.J. Padma Rao, R/o Brahmin Street, Ichapuram, Ichapuram Municipality, Srikakulam District, Andhra Pradesh, Pin:- 532312.

Please take notice that the plaintiff has filed the above suit against you and others for partition and the same is posted to **16-04-2025 for your appearance at 10-30 A.M.** before the Hon'ble Court of the Junior Civil Judge, Ichapuram and you are to appear in person or through Advocate, failing which the matter will be decided in your absence.

// BY ORDER //

MONOJ KUMAR SAMONTO, ADVOCATE, ICHAPURAM, SRIKAKULAM DISTRICT, ANDHRA PRADESH - 532312.

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నూతన బస్సులను నడుపుతోందని, ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఆర్‌టిసి డిపోలో మూడు నూతన బస్సులను మంగళవారం జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సులు పాతవి కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి వచ్చిన తర్వాత ఇప్పటికే నూతన బస్సులను ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రైబ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, డిపో మేనేజర్ సీతారాం నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పినకాన సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వీర గున్నమ్మకు నివాళి

మందస: పోలీసుల కాల్పుల్లో వీర గున్నమ్మ, గుండ బుడియాడు, గొర్లె జగ్గయ్య, కర్రి కళియాడు, గుంట చిన్నారాయణ మృతి చెంది జిల్లా రైతాంగ ఉద్యమాల చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందారని వీరగున్నమ్మపురం సర్పంచ్ కర్రి గోపాల్ అన్నారు. మండలంలోని వీరగున్నమ్మపురంలో ఆమె వర్ధంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆమె స్తూపం వద్ద నినాదాలు చేస్తూ... నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తెలుగు మహిళల్లో వీర గున్నమ్మ ఒకరు అన్నారు. రైతుల పక్షాన బ్రిటీష్, జమీందారుతో పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దానయ్య, డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్, జనకిరెడ్డి, సూర్యారావు, హరికృష్ణ, అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షుడు మడియా రామకృష్ణ, గుంపు జగదీష్ పాల్గొన్నారు.

టెక్కలి బార్ అధ్యక్షునిగా అజయ్‌కుమార్

టెక్కలి : టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా పినకాన అజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సంపతిరావు సూర్యారావు, ఉపాధ్యక్షునిగా చంద్రశేఖర్ పట్నాయక్, సహాయ కార్యదర్శిగా దాడి ధర్మారావులను ఎన్నుకున్నారు. ప్రస్తుత అధ్యక్షులు దివ్వల వివేకానంద నుంచి బాధ్యతలను స్వీకరించారు. అజయ్‌కుమార్ నందిగాం మండల టిడిపి అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. నూతన కార్యవర్గాన్ని న్యాయవాదులు పేడాడ బాబూరావు, సాయిరాజ్, వైకుంఠరావు పాణిగ్రాహి, దవళ రాజేశ్వరరావు, అద్దాల రాజేష్ అభినందించారు.

మార్కెట్ అస్తవ్యస్తం

పేరుకుపోయిన చెత్తా చెదారం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - గుజరాతీపేట

నగరంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్ అస్తవ్యస్తంగా మారింది. మార్కెట్‌లోని రోడ్లపై వ్యాపారులు అనుచితంగా బళ్లు పెట్టుకోవడంతో నడిచేందుకు సైతం మార్గం లేకుండాపోయింది. వ్యాపారస్తుల అనుచిత చర్యలకు మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై వ్యాపారాలు దీనివల్ల పాదచారులు, చిన్న వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండగ సమయాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఇంతకుముందు పలుమార్లు మున్సిపల్ అధికారులు మార్కెట్‌ను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకున్నా, ఫలితం కనిపించలేదు. వారి జోక్యం తాత్కాలికమేనా? లేక వ్యాపారుల ప్రాబల్యానికి అధికారులు తలొగ్గారా? అన్న సందేహం కలుగుతోంది. సామాన్య ప్రజలు మాత్రం ఇక్కట్లు ఎదుర్కొంటూనే ఉన్నారు. కనీసం కొనుగోలుదారులు తమ వాహనాలను నిలిపడానికి స్థలమే లేదు. తగిన ఏర్పాట్లు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి, పట్టణ జీవనం అస్తవ్యస్తమవుతోంది. నిత్యం స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. మార్కెట్ ఇప్పుడు కేవలం వ్యాపార కేంద్రంగా కాకుండా మురికిపోకడకు మారింది. రోడ్లపై గుంపులు గుంపులుగా వ్యాపారస్తులు బళ్లు పెట్టడమే కాకుండా, అపరిశుభ్రతను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇక్కడికి వచ్చేవారికి దుర్వాసన, చెత్తాచెదారం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం, మురుగు కాలువలు తెరిచి ఉండటంతో మార్కెట్ పరిసరాలు అసహ్యకరంగా మారాయి. పాలకులు పట్టించుకోకపోవడం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వల్ల వ్యాపారులు, కూరగాయలు అమ్మేవారు, లారీ డ్రైవర్లు తమకు నచ్చినట్లు మసలుకుంటున్నారు. వ్యాపార ప్రాంతం కంటే చెత్త డంపింగ్ యార్డులా కనిపిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే పారేస్తున్నారు. ఫలితంగా దోమలు, ఈగలు పెరిగి ఆరోగ్య సమస్యలు పెచ్చరిల్లుతున్నాయి. మార్కెట్ చుట్టూ చెత్త పేరుకుపోవడం వల్ల రోగాల ప్రమాదం పొంచి ఉంది.ప్రభుత్వం తరచూ పరిశుభ్రతపై ప్రచారం చేస్తుంది కానీ, నగర కార్పొరేషన్ అధికారులు మాత్రం దీన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచాలన్న ప్రయత్నం ఎక్కడా కనిపించడంలేదు. గతంలో కూడా మార్కెట్ శుభ్రత కోసం ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకున్నా, పరిస్థితి మాత్రం మారడం లేదు. వాహనాలు నిలిపే స్థలం లేకపోవడం, రోడ్లపై వ్యాపారుల హడావిడి, చెత్త పేరుకుపోవడం ఇవన్నీ కలిసొచ్చి మార్కెట్‌ను నరకంగా మార్చేశాయి. కనీసం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులైనా వెంటనే స్పందించి మార్కెట్ శుభ్రతపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలంలో సినిమా థియేటర్ ఎదురుగా అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... లావేరు మండలం కొత్తకుంకాంకు చెందిన గుడ్ల నారాయణమూర్తి (60) కుటుంబంతో రణస్థలం మండల కేంద్రంలోని సినిమా థియేటర్ ఎదురుగా 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయన కుమారుడు సంతోష్‌కి వివాహమైంది. ఉద్యోగ రీత్యా ఆయన హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. నారాయణమూర్తి భార్య రూపదేవి కూడా కుమారుడు సంతోష్ వద్ద ఉంటుంది. నారాయణమూర్తి ఒక్కరే స్థానికంగా ఉంటున్నారు. ఆయనకు ఫిట్స్ ఉండేవని స్థానికులు చెబుతున్నారు. మూడు రోజులుగా కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఉన్నవారికి అనుమానం వచ్చి మంగళవారం తలుపులు తెరిచి చూశారు. ఇంట్లో నారాయణమూర్తి మృతి చెంది కనిపించాడు. దుర్వాసన రావడంతో తలుపులు మూసేసి పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే జె.ఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. రాత్రి సమయంలో ఫిట్స్ వచ్చి అమాంతంగా పడిపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులో పడి యాచకుడు...

సోంపేట : మండలంలోని కొర్లాం తారేశ్వరాలయం సమీపంలోని కొత్త చెరువులో పడి మందస మండలం బాలిగాంకు చెందిన గున్నయ్య (70) మృతి చెందాడు. బారువ ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గున్నయ్య భిక్షాటన చేస్తూ అయ్యేట నివాసమంటూ జీవనం గడుపుతున్నాడు. సోమవారం రాత్రి కొర్లాం తారేశ్వరాలయం వద్ద నిద్రించే సమయంలో చెరువులో పడిపోయాడు. ఎవరు గమనించకపోవడంతో అతడు మృతి చెంది ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరుగురిపై బైండోవర్

పాతపట్నం: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరుగురిపై బైండోవర్ కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు నాటుసారా నిందితులను తహశీల్దార్ కె.కిరణ్‌కుమార్ ముందు మంగళవారం హాజరుపరిచామన్నారు.

బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన 'పది' పరీక్షలు

టెక్కలి : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. వాస్తవంగా సోమవారంతో ముగియాల్సిన ఈ పరీక్షలు రంజాన్ పర్వదినం సందర్భంగా మంగళవారానికి ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో సాంఘీకశాస్త్రం పరీక్షతో ముగిశాయి. గత నెల 17 నుంచి పరీక్షలు రోజు తప్పించి రోజు చొప్పున నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు మస్తానయ్య పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

వీధి మధ్యలో విద్యుత్ స్తంభం

కొత్తూరు: కొత్తూరులోని బిసి కాలనీల రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో స్థానిక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ దారిలో వాహనాలు కానీ ఎటువంటి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 20 ఏళ్ల కిందత విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. కాలనీ అభివృద్ధి, కొత్త ఇళ్లు నిర్మించడంతో ఈ స్తంభం మధ్యలో ఉండిపోయింది. ఈ స్తంభం వల్ల ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి స్తంభాన్ని మార్పు చేయాలని కోరారు.

డిఇఒను తప్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లా విద్యాశాఖ అధికారి సదాశివుని తిరుమల చైతన్య పాల్పడిన అక్రమాలపై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, తక్షణమే డిఇఒను విధుల నుంచి తప్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేసి నినాదాలు చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులపై ఉన్న అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, వారిపై పెట్టిన క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నుంచి పి.అప్పారావు, కె.దాలయ్య, ఎపిటిఎఫ్ నుంచి టి.బాబూరావు, జి.శ్రీనివాసరావు, పిఆర్‌టియు నుంచి జె.బాబూరావు, ఎన్.సన్యాసిరావు, ఎపిటిఎఫ్ నుంచి వి.ఆదినారాయణ, బి.నారాయణరావు, ఆపస్ నుంచి పి.అప్పారావు పాల్గొన్నారు.

సోంపేట : ఎచ్చెర్ల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులను అక్రమంగా సస్పెండ్ చేసిన డిఇఒను విధుల నుంచి తొలగించాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం

సోంపేట : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సోంపేట డిటి మహేష్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, చాణిక్య, కూర్మారావు, చంద్రశేఖర్, రాజేష్, తిరుపతి, గోవిందరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి అనంతరం తహశీల్దార్ పి.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వి.రమణ, టివిటి భాస్కరరావు, బొడ్డేపల్లి గోపీచంద్, చింతాడ వెంకటరమణమూర్తి, కింతలి చంద్రరావు, పేడాడ అన్నాజీ, బి.సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, బొడ్డేపల్లి రమేష్, పైడి రాజు, వడ్డాది గోపీకృష్ణ, పంచాది రవికుమార్ పాల్గొన్నారు.

టెక్కలి : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో ఉంచిన పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

రేపు...

పలాస : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.వసంత కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 సచివాలయాలు పరిధిలో బిసి కార్పొరేషన్ రుణాలకు 427 మంది దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు వచ్చే సమయంలో తమతో పాటు నూతనంగా తయారు చేసిన తరగతి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులు, పాస్‌సైజ్ ఫొటో తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఇంటర్వ్యూలకు అధికారులతో పాటు బ్యాంకు అధికారులు హాజరు అవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవిటి: మండలంలో బిసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండు ప్రతుల దరఖాస్తులు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

మాట్లాడుతున్న తిరుపతినాయుడు

సహజ వనరుల దోపిడీ

అరసవిల్లి : కూటమి ప్రభుత్వం ప్రజా పాలన, సంక్షేమంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు కోరారు. నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు జిల్లాలో ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌తో సహజ వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. జీవ నదులను యంత్రాలతో తవ్వుకుపోతే రానున్న రోజుల్లో నీటి కొరత గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను, ప్రజా సంఘ నాయకులను వేధించి అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ రైట్స్ కార్యదర్శి కె.కోటయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

అయోమయంలో దూర విద్య విద్యార్థులు

టెక్కలి : పద్మావతి, వెంకటేశ్వర యూనివర్సిటీల్లో అమలవుతున్న దూర విద్య యుజి, పిజిలు చదువుతున్న విద్యార్థులు అయోమయంలో పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు ఆందోళనకు గురిచేశాయి. స్టడీ సెంటర్ పరిధిలో నిర్వహించాల్సిన ఈ పరీక్షలను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేపట్టాలని యూనివర్సిటీలు కొత్తగా తీసుకున్న నిర్ణయంపై దూర విద్య చదువుతున్న విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు గందరగోళంలోకి నెట్టబడ్డారు. ఇప్పటి వరకు స్టడీ సెంటర్ల ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రయివేట్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యాన పరీక్షలు నిర్వహించేవారు. దీనివల్ల చాలామంది విద్యార్థులు దూర పరీక్షా కేంద్రాల ద్వారా డిగ్రీలు పూర్తి చేసేందుకు ఆసక్తి చూపేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు కాదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేశారు. దీంతో దూర విద్య ద్వారా పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు గందరగోళంలోకి నెట్టబడ్డారు. ప్రయివేట్, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు అర్హత కోసం రాసే దూర విద్యా కేంద్రాల పరీక్షలనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అప్పగిస్తూ... యూనివర్సిటీలు తీసుకున్న నిర్ణయం వల్ల చాలామంది విద్యార్థుల భవితవ్యం అయోమయంలోకి నెట్టడం గమనార్హం. ఇదిలా ఉండగా దూర విద్య కేంద్రం సరఫరా చేసిన పుస్తకాలు కాకుండా ఇప్పటికప్పుడే సిలబస్ మార్చివేసి వాటిని విద్యార్థుల వాట్సాప్‌కు పంపడంతో గందరగోళం ఏర్పడింది. దీనికి తోడు ఆది, సోమవారాలు సెలవులు కావడం మంగళవారం జారీ అయిన హాల్‌టిక్కెట్‌ల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో పరీక్షలు రాయాలని సూచించడంతో విద్యార్థులు కంగుతిన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ స్థాయి అధికారులు తమ నిర్ణయం మార్చుకోవాలని దూర విద్య చదువుతున్న విద్యార్థులు కోరుతున్నారు.

భానుమతి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పాలవలసకు చెందిన సామాజిక సేవకులు గార భానుమతి జీవితం అందరికీ ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం భానుమతి స్వగృహం వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో పిఎస్ఐ సంస్థ సభ్యులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎస్ఐ సంస్థ వ్యవస్థాపకులుగా భానుమతి చేసిన సేవలను కొనియాడారు. ఆవిడ సేవలను కొనసాగిస్తూ ఆమె కుమారుడు బాబూరావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను గురించి తెలియజేశారు. వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్న బాబూరావు పిఎస్ఐ సంస్థ కార్యకలాపాలను

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గ్రామస్తులు

కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతానికి అంబులెన్స్ సేవలు, పాఠశాలలో రన్నింగ్ ట్రాక్ నిర్మాణం, సంస్థ ద్వారా చేపట్టిన సేవలను ప్రశంసించారు. సంఘ సేవకురాలుగా భానుమతి చూపిన మార్గాన్ని ఆమె కుమారుడు కొనసాగించడం స్ఫూర్తిదాయకమన్నారు. ముందుగా భానుమతి చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు.

అధైర్యపడొద్దు... ఆదుకుంటాం

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

అధైర్య పడవద్దని... అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వనితమండలం పంచాయతీ గజపతినగరానికి చెందిన దుంగ రాములమ్మకు వైద్య ఖర్చు నిమిత్తం రూ.60,600 సిఎం సహాయ నిధి చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరో పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మెండ రాము పాల్గొన్నారు.

ఆధార్ కార్డు తప్పనిసరి

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి నిర్వహించనున్న వెంకటేశ్వర విశ్వవిద్యాలయం దూరవిద్య పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు తమ హాల్‌టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డు కూడా తప్పనిసరిగా తీసుకురావాలని పరీక్షల సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఫొటో, ఇతర గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. అభ్యర్థులు పరీక్షకు గంట ముందుగా హాజరుకావాలన్నారు.

రిమ్స్ లైబ్రరీలో అగ్ని ప్రమాదం

గుజరాతీపేట : జిల్లా సర్వజనాస్పత్రి మెడికల్ కాలేజీ మొదటి అంతస్తు డిజిటల్ లైబ్రరీలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో లైబ్రరీ ఇన్‌చార్జి బి.దేవానంద్, అసిస్టెంట్ లైబ్రేరియన్ సుజాత, బుక్ బేరర్ ఎన్.సావిత్రి గమనించి ప్రిన్సిపాల్ చలంకు సమాచారం అందజేశారు. ప్రిన్సిపాల్ విద్యుత్‌శాఖకు ఫోన్ చేసి సరఫరాను నిలుపుదల చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఎసి, ఇన్వర్టర్ బ్యాటరీలు, మూడు కుర్చీలు కాలిపోయాయి. రూమ్ మొత్తం బూడిదగా మారి దుమ్ము, ధూళితో ఏర్పడింది. కంప్యూటర్లు దెబ్బతిని ఉంటాయని భావిస్తున్నారు.

దగ్ధమైన లైబ్రరీ రూమ్

అభినందిస్తున్న తల్లిదండ్రులు

జ్యోత్స్నకు ఉద్యోగాల కొలువు

ప్రజాశక్తి- బూర్జ

చదువుల సరస్వతి జ్యోత్స్నకు వరస మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని ఓ.వి.పేటకు చెందిన నక్క జ్యోత్స్నకు తాజాగా ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జ్యోత్స్న విజయనగరం జెఎన్‌టియులో ఇంజినీరింగ్ ఇఇఇ పూర్తి చేశారు. అనంతరం ఎల్‌అండ్‌టిలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా తొలి ఉద్యోగం సాధించారు. అలాగే తెలంగాణ గ్రామీణ బ్యాంకు పిఒగా కొలువు దిరారు. ప్రస్తుతం బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర పిఒగా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులకు ఎంపికయ్యారు. జ్యోత్స్న తల్లి కుమారి మాజీ సర్పంచ్, తండ్రి రమణమూర్తి తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తమ కుమార్తెకు ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు రావడంతో ఆనందంగా ఉందని అన్నారు. కుమారుడు కూడా బ్యాంకు ఉద్యోగాలు సాధించడం విశేషం.

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలైందని కమిషనర్ ఎన్.రామారావు మంగళవారం తెలిపారు. ప్రయివేటు ఆస్తుల నుంచి రూ. 5.48 కోట్లు వసూలు చేశామని చెప్పారు. గతేడాది వసూళ్లతో పోల్చుకుంటే ఈ ఏడాది 10.50 శాతం అదనంగా రూ. 2 కోట్లు వసూలు చేశామన్నారు. శత శాతం పన్నులను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

మట్టి తవ్వకాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండల పరిధిలో మట్టి తవ్వకాలపై తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ఉక్కు పాదం మోపారు. ఇటీవల కాలంలో మున్సిపాలిటీ, మండల పరిధిలో ప్రొక్లెయినర్ల సహాయంతో మట్టి తవ్వకాలు ఇష్టారాజ్యంగా ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై తహశీల్దార్ దృష్టిసారించారు. సోమవారం అర్ధరాత్రి కంబిరిగాం కూడలి వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్ కాపుకాశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రొక్లెయినర్ యాజమాన్యాలు ఇతర మార్గాల ద్వారా తమ వాహనాలను మళ్లించారు. ఆ దారిలో మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం పరారీ అయిన ప్రొక్లెయినర్లను పట్టుకొని తమకు అప్పగించాలని కాశీబుగ్గ పోలీసులకు ఆదేశించారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నూర్పు యంత్రాలను అందజేస్తున్న రామకృష్ణ నాయుడు

నూర్పు యంత్రాలు అందజేత

ప్రజాశక్తి- బూర్జ

ఆహారం, పోషణ పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం అందజేస్తున్న నూర్పిడి యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. మండలంలోని నీలాపురం, పెద్దపేట, లంకాం గ్రామాలకు చెందిన రైతుల ఉకలాపు పట్టాభి నాయుడు,. జల్లు కృష్ణ, సురపు లక్ష్మీనారాయణకు రాయితీపై నూర్పు యంత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి ఎడి రాజగోపాల్, ఎఒ ఎన్.శ్రీనివాసరావు, ఓనిగడ్డ నీటి సంఘం అధ్యక్షుడు కడగల కృష్ణ, మజ్జి అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకులు జల్లు జగదీష్, పల్లా సాయి, తేజ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ సంఘం అధ్యక్షునిగా రాము

పొందూరు: పొందూరు, జి.సిగడాం మండలాల ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ సంఘం అధ్యక్షునిగా సీర రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్

రాము

సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో ప్రధాన కార్యదర్శిగా రేగడి సతీష్, కోశాధికారిగా వజ్రగడ సాయిలను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ సభ్యులతో బుధవారం ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పొందూరు : డాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథి స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ పబ్లిక్ పరీక్షలో చక్కగా చదివి బాగా రాసిన విద్యార్థులకు, చదువు చెప్పిన అధ్యాపకు అభినందించారు. బాగా చదివి ఉన్నత స్థానంలో ఎదగాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ ఇందిరారెడ్డి, మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, శ్రీధర్, పద్మజ, శాంతి, యశోద, రోజా, జయలక్ష్మి, మీనా, స్నేహ, సరోజిని, రవి, ప్రమీల పాల్గొన్నారు.

భాష్యంలో...

పొందూరు: మండలంలోని వావిలిపల్లిపేట కూడలిలో వద్ద ఉన్న భాష్యం స్కూల్లో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగుల వెలుగుల మధ్య ఆటపాటలు, నాటకాలు, నృత్యాలతో ఆద్యంతం అలరించారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యం.శివనారాయణ, ప్రిన్సిపాల్ టి.సుబ్రమణ్యం, జోనల్ చాంప్స్ కో-ఆర్డినేటర్ శైలజ, హెచ్‌ఎం నీలిమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

కుటుంబ వ్యవస్థ కీలకం

కవిటి : దేశ సర్వతోముఖాభివృద్ధిలో కుటుంబ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులకు చిన్నతనం నుంచే కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యత, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యత వివరించాలని ముఖ్య అతిథి వి.కృష్ణప్రసాద్, ప్రముఖ వక్త లింగం సుధాకర్‌రెడ్డి తెలిపారు. భారతీయ విద్యా కేంద్రం 13 ఏకోపాధ్యాయ పాఠశాలల సమ్మేళనం మండలంలోని చిన్నకర్రివానిపాలెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి మనకు మొదటి గురువని, ప్రకృతిని అనుసరించి జీవన విధానం కొనసాగిస్తే వాతావరణంలోని అసమానతలు నివారించవచ్చని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు చిన్నతనం నుంచే కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యత, ప్రకృతి ప్రాధాన్యత తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మారుమూల ప్రాంతాలతో పాటు మత్స్యకార గ్రామాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు నిర్వహిస్తున్న బివికె యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో బల్లెడ కృష్ణారావు, దాసప్ప, మార్పు అనిల్, బల్లెడ యజ్ఞానంద్, కర్రి లచ్చయ్య, జానకిరామయ్య, కృష్ణకుమార్, డి.కృష్ణమోహన్, డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కోటబొమ్మాళి : పింఛను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని, వారి జీవన ప్రమాణాల పెంపునకు మొదటి అడుగు పడిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కిష్టుపురంలో మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు పింఛను పెంచామన్నారు. డయాలసిస్, తలసేమియా రోగులకు రూ.10 వేలు ఇస్తున్నామని తెలిపారు. మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు వేలు పింఛను అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

కవిటి: పెంచిన పింఛన్ల డబ్బులతో బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని కొత్తగా మంజూరైన 27 పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వితంతు పింఛను కోసం నెలల తరబడి వేచిచూసే పరిస్థితి ఉండేదని, కానీ, ఇప్పుడు తక్షణమే పింఛను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, బెందాళం రమేష్, ఆరింగి మధు, బార్ల చినబాబు, బెందాళం తిరుమల, గొనప సంతోష్, పుల్లట సంతోష్ పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని మబగాంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛనను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నం : పాతపట్నం పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఇన్‌ఛార్జి ఇఒ కిషోర్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి సీర్ల జోగారావు, మండల అధ్యక్షుడు పైల బాబ్జి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని చీపురుపల్లిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ బడే పాపారావు, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, లక్ష్మీనారాయణ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి, ఎంపిటిసి నంబాల వెంకటరావు, బుర్ల లలిత కుమారి పాల్గొన్నారు.

పలాస : మూడో వార్డు జయరామచంద్రపురంలో కిడ్నీ రోగికి ఎమ్మెల్యే గౌతు శిరీష రూ.పది వేలు పింఛను అందజేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కవిటి : పింఛను పంపిణీ చేస్తున్న విప్ అశోక్

శ్రీకాకుళం అర్బన్ : నగంరలోని గుజరాతీపేట, పిఎన్ కాలనీ, గార మండలంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు.

లావేరు : మండలంలోని బొంతుపేటలో ఎన్‌టిఆర్ సామాజిక పింఛనను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, తహశీల్దార్ ఎన్ని జోగారావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు పాల్గొన్నారు. సుభద్రాపురంలో రహదారికి అనుకుని ఉన్న టిఫిన్ కొట్టు ముందు నిల్చొని అందరితో పాటుగా సాధారణ వ్యక్తి వలే అల్పాహారం తీసుకున్నారు

ఇచ్ఛాపురం : 16వ వార్డు పెద్దదేవరవీధిలో డలయాసిస్ రోగికి వార్డు ప్రతినిధి నాగరాజ్‌పాత్రో, కమిషనర్ ఎన్.రమేష్, సచివాలయ కార్యదర్శి ప్రియాంక రూ.పది వేలు పింఛను అందజేశారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పెదంచలలో మంగళవారం ఉపాధి హామీ నిధులతో నీటి తొట్టె నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న తరుణంలో పాడి పశువులకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పెదంచల, రెంటికోట, టెక్కలిపట్నం, బొడ్డపాడు గ్రామాల్లో నీటి తొట్టెలు మంజూరు చేశామన్నారు. వేసవి సమయంలో చెరువులు, కుంటలు వాగులో నీరు అడుగంటి పోతే నీటి తొట్టెలు సహాయంతో పశువులకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంతకుమార్, మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, పశుసంవర్ధకశాఖ ఎడి చంద్రశేఖర్, టిడిజి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎం.నరేంద్ర, పశుసంవర్ధకశాఖ అధికారి మధు, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో పశువులు, ఇతర జీవరాసుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. మంగళవారం గార మండలం అచ్చెన్నపాలెం, శ్రీకాకుళం మండలం బైరివానిపేట గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.

మెళియాపుట్టి : పంట సంజీవినిలో భాగంగా నీటి కుంటల నిర్మాణంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దమడిలో నీటి కుంటల నిర్మాణం పనులను శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎపిఒ తెంబూరు రవి, ఇసి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- లావేరు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మడాంలో మంగళవారం నిర్వహించిన మన ఎచ్చెర్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మడాం పంచాయతీలో రూ.40 లక్షలతో సిమ్మెంట్ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ జోగారావు, ఎంపిడిఒ వెంకటరాజు, జనసేన నాయకులు విశ్వేక్షన్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, లుకలాపు అప్పులనాయుడు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని బెల్లుపడాలో ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న శ్రీరామ తారక మహామంత్ర సహిత పంచకుండత్మక యజ్ఞానానికి సహకారం అందిస్తానని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ముందుగా మంగళవారం నిర్వహించిన శుభ రాటలో పాల్గొన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద అధికారులతో, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొమ్మిదేళ్లకోసారి నిర్వహించే ఈ యజ్ఞానికి యాత్రికులు తరలి వస్తారని, దానికి తగ్గట్టు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా తాగునీరు, శానిటేషన్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఆసీ చిరంజీవులురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, టౌన్ ఎస్ఐ ముకుందరావు, విద్యుత్ శాఖ ఎఇ గోవిందరావు, గ్రామీణ నీటి సరఫరా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటు

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు, చర్చిలు, మసీదు వద్ద సిసి కెమెరాలను మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తండ్యాం, కొంచాడ వద్ద గల చర్చిల వద్ద, అలాగే కొంచాడలోని ఆంజనేయ స్వామి ఆలయం, దల్లవలసలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రార్థనా మందిరాల వద్ద ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భద్రతను పెంపొందించే చర్యల్లో భాగంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సిసి కెమెరాలతో ఎస్ఐ సత్యనారాయణ

హౌసింగ్‌పై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని హౌసింగ్‌శాఖ పని విధానంపై ఎమ్మెల్యే గౌతు శిరీష సమావేశం నిర్వహించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ స్టేజీలు, కూటమి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన బిల్లులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఇంటి స్థలం ఉండి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మొదటి ఫేజ్‌లో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, అందులో అర్హుల ఎంతమంది అనే అంశాలను అడిగారు. కార్యక్రమలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పీరికట్ల విఠల్‌రావు, హౌసింగ్ ఇఇ నరసింగరావు, డిఇ వి.వి.సత్యవతి, మందస, వజ్రపుకొత్తూరు, పలాస రూరల్, అర్బన్ ఎఇలు దినేష్, సాయికిరణ్, మణికంఠ, రాజ్ మోహన్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పేదలకు అండ

పేదలకు ఎటువంటి సమస్య వచ్చిన కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శాంతి నగర్‌లో నివాసం ఉంటున్న 52 మందికి ఇళ్ల పొజీషియన్ పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూ రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని చాపురం పంచాయతీ నర్సెస్ కాలనీ రోడ్డు ఆక్రమణలపై చర్య తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కోరారు. మంగళవారం ఆ ప్రాంతంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న సందర్భంగా స్థానికులు వివరించారు. 80 అడుగులు వెడల్పుతో రోడ్డు కేటాయించారని వివరించారు. ప్లాట్ లేఅవుట్‌లో కూడా 80 అడుగుల రోడ్డు చూపించారని, ఆ తర్వాత 2013లో కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని అన్నారు. అప్పట్లో కాలనీ వాసులు ఫిర్యాదుతో అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోగలిగాలమని తెలిపారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని నగరపాలక సంస్థ అధికారులతో చర్చించి ఆక్రమణల తొలగింపునకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బిర్లంగి రామ్మోహన్, గొప్పు సంతోష్, జొడ్డు మహంతి సంతోష్, ఎ.యు.ఎస్.ప్రసాద్, హనుమంతు ప్రసాద్, శ్రీరాములు, బొడ్డు బిందుకృష్ణ, గెడ్డవలస సురేష్, హనుమంతు లక్ష్మీపతి, నంబాల్ల శిషిభూషన్, సనపల నరసింగరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వ కాలేజీల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందిస్తున్నామన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒలు దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, మాజీ ఎంపిపిలు ఎస్.మోహనరావు, బైరసింగ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు

నాటుసారా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

నాటు సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు హెచ్చరించారు. మండలంలోని గోదావరిపురం, సవరరామకృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా తాగడం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వరిశ రామారావు,కార్యదర్శి ఖగేశ్వరరావు, ఎస్ఐ షేక్ సైదాబి పాల్గొన్నారు.

తెలంగాణ వేదికపై మెరిసిన చిన్నారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగు నూతన సంవత్సర ఉగాది సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ఆమదాలవలస పట్టణానికి చెందిన చిన్నారులు అద్భుత ప్రదర్శనతో ప్రశంసలు అందుకున్నారు. మంగళవారం నృత్య శిక్షకురాలు డాక్టర్ ఏలేశ్వరం శ్రీనివాసులు, శిష్యురాలు కూన శ్రీలత విలేకరులతో మాట్లాడారు. ఉగాది సందర్భంగా యాదాద్రి క్షేత్రంలో ఆమదాలవలస నృత్య విద్యార్థులు సుస్మిత హిమశ్రీ, పవన సాయి, లాస్యప్రియ, జ్ఞానశ్రీవల్లి కూచిపూడి నత్య ప్రదర్శన చేశారని తెలిపారు. చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను బహుకరించి సత్కరించినట్లు ఆమె తెలిపారు.

నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

మొదటి రోజు అంతంతమాత్రమే

టెక్కలి: మంగళవారం నుంచి ఇంటర్మీడియట్ తరగతులు బోధన చేయాలనే బోర్డు కొత్త నిర్ణయం మేరకు కళాశాలలు తెరుచుకున్నాయి. అయితే మొదటి రోజు విద్యార్థుల హాజరు అంతంత మాత్రమే. ఎన్నడు లేని విధంగా ఈ ఏడాది నుంచే కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని ఇంకా విద్యార్థులు గమనించలేదు. అయితే ఈ నెల 23 వరకు మాత్రమే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహణ చేపట్టనున్నారు. అయితే మారిన ఈ విధానం ప్రకారం ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమైనా విద్యార్థులు మాత్రం పదుల సంఖ్యలోనే హాజరయ్యారు. వసతిగృహాలకు చెందిన విద్యార్థులను రప్పించేందుకు కళాశాలల యాజమాన్యాలు సిద్ధమవుతున్నారు.

దర్శించుకుంటున్న చింతాడ రవి

చింతాడ రవి సందర్శన

బూర్జ : మండల కేంద్రంలో మూడు రోజులుగా సకల లచ్చమ్మ పేరంటాలు పండగ నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, అలాగే ఎమ్మెల్యే రవికుమార్ సతీమణి ప్రమీల, ఎపి గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ ఎ.ఆర్.కె.నాయుడు మంగవాళవారం దర్శించుకున్నారు. అలాగే సర్పంచ్ వేగు అనురాధ, ఎంపిటిసి చుక్కల పోలినాయుడు, వైసిపి నాయకులు తొత్తడ సురేష్, దాలయ్య, లక్ష్మీనారాయణ, అప్పన్న, ప్రసాద్ కూడా దర్శించుకున్నారు.

ముగిసిన శిక్షణ

మందస : మహిళా స్వయంశక్తి సంఘ కుటుంబాలకు జీవనోపాధులను మెరుగుపర్చుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటిడిఎ వెలుగు ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు సవరకాంతమ్మ అధ్యక్షతన లైవ్లీ హుడ్ క్రెడిట్ ప్లాన్ తయారీ గురించి ఎన్యూమరేటర్ల శిక్షణ మంగళవారంతో ముగిచింది. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ వీరంనాయుడు, మండల సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, మండల సమాఖ్య కోశాధికారి విజయశ్రీ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలకు నిర్వహించిన శిక్షణ ముగిసిందని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ఎపిడి సన్యాసిరావు తెలిపారు. మహిళా సంఘ సభ్యులు స్వతహాగా బతికేందుకు జీవనోపాధి ప్రణాళిక వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎంలు లలిత, పార్వతి, సిఎఫ్‌లు గోవిందరావు, జయంతి, ప్రమీల, మిన్నారావు, కేశవరావు, పుష్పలు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సభ్యులు

ఆత్మీయ సత్కారం

కవిటి: జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. కవిటిలో నిర్మాణ దశలో ఉన్న కాళింగుల కళ్యాణ మండపం నిర్మాణానికి జెడ్‌పి చైర్‌పర్సన్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్‌లో కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, బెందాళం చిట్టిబాబు, బెందాళం రమేష్, ఆరింగి మధు, పూడి నీలాచలం, ఆరింగి కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఘోరచంద్ పల్కా

ఒలింపియాడ్‌పై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని చినమండల వీధిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులకు, తల్లిదండ్రులు మంగళవారం ఒలంపియాడ్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఘోర చంద్ పల్కా మాట్లాడుతూ విద్యారంగంలో బలంపియాడ్ ఐఐటి విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల భవిష్యత్ విద్యలో మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాధాన్యత ఉంటోందన్నారు. ఒలంపియాడ్ బోధన వల్ల విద్యార్థుల ఉన్నతికి భవిష్యత్‌కు సహకరిస్తుందన్నారు. రెగ్యులర్ సిలబస్తో పాటు, ఐఐటి సిలబస్ అనేది తప్పక అవసరమన్నారు. పదో తరగతి పూర్తయ్యాక, ఇంటర్ విద్యకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఎంసెట్, ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో మెలకులవలను నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిఐ రమేష్ పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులు

ఏడుగురు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు చక్కని ప్రతిభకనపరచి పీపుల్టెక్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. వీరికి వార్షిక వేతనంగా రూ. 3 లక్షలను ఆ కంపెనీ చెల్లిస్తుందని పేర్కొన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్‌డి డాక్టర్ పి.శ్రీహరి, టిపిఒ డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్ అభినందించారు.

కవితల పోటీల్లో 'కుప్పిలి'కి ద్వితీయ బహుమతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలంగాణ రాష్ట్రంలోని పాల్వంచ కళా పరిషత్ రెండు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో ఆమదాలవలస పట్టణానికి చెందిన కవి రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు పాల్వంచ కళా పరిషత్ కార్యదర్శి వేముల కొండలరావు సమాచారం పంపినట్లు రాజారావు తెలిపారు. కుప్పిలి ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అంశంపై రచించిన 'హృదయంలో కృత్రిమ ముల్లు' అనే కవితకు ఈ బహుమతి లభించింది. వెంకట రాజారావుకు బహుమతి లభించడంపై కళాకారులు అభిమానులు బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక అమర జ్యోతి స్కూల్ ఇటీవల నిర్వహించిన నాసో (నేషనల్ ఆస్ట్రానిమికల్ సైన్స్ ఒలింపియాడ్) జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 165 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్ష రాసిన విద్యార్థుల్లో 17 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, మెరిట్ ధ్రువపత్రాలు పొందారు. లెవెల్-1లో బంగారు పతకాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు ఎంఇఒ సిహెచ్.తిరుమలరావు బహుమతులను మంగళవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సోమేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ ఇప్పిలి మురళీకృష్ణ పాల్గొన్నారు.